సాక్షి రంగారెడ్డి

శనివారం । 6 । జనవరి । 2024



కోర్టు భవన నిర్మాణానికి కృషి

జూనియర్ సివిల్ కోర్టు భవన సముదాయ నిర్మాణానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి హామీ ఇచ్చారు. 8లో▸



అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర

జల్‌పల్లి గ్రామంలోని తాళ్లకుంట శిఖం భూమిలో వెలిసిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. 8లో▸



అభివృద్ధికి సహకరించండి

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు సహకరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. 8లో▸

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బోధించేందుకు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో హిస్టరీ-1, ఎకనామిక్స్-1 పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హులైన మహిళా అభ్యర్థులు సంబంధిత పత్రాలతో ఈ నెల 8లోపు కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకోసం 83419 15656, 63000 51306, 98850 03390 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫైళ్లను పెండింగ్‌లో పెట్టొద్దు

- త్వరితగతిన పరిష్కరించాలి
- అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రతి శాఖలో ఈ-ఆఫీసు ద్వారా కార్యకలాపాలు చేపట్టాలని కలెక్టర్ శశాంక అన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని, కార్యాలయాల్లో ఫైళ్లను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని.. అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ శశాంక అన్నారు. గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ, శంషాబాద్ మండలం పెద్ద గోల్కొండ తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలను శుక్రవారం ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న ప్రజలతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ చిత్రకారుడు నరేంద్రరాయ్, పి.ఎస్.మూర్తి, ప్రీతీ జైన్, దీక్షిత యాదవ్, దిశా అగర్వాల్, రాఖీ లడ్డా, సాన్వీపాయ్‌ల చిత్రాలను శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ జనరల్ సెక్రటరీ తన్నీరు శ్రీనివాస్ పాల్గొన్నారు. చిత్రాలు చరిత్రకు మార్గదర్శకంగా ఉంటాయన్నారు.

మళ్లీ 'పుర' లొల్లి

- మొదలైన అవిశ్వాసాల ప్రక్రియ
- ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీల్లో గతంలోనే ఫిర్యాదులు
- తాజాగా ఆదిబట్ల చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి నోటీసులు



ఆదిబట్ల చైర్మన్, వైస్‌చైర్మన్లపై అవిశ్వాసం పెట్టాలని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేస్తున్న పలువురు కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం: పురపాలికల్లో అవిశ్వాస లొల్లి మళ్లీ మొదలైంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా అందులో మూడింటిలో గత ఏడాది నుంచి అవిశ్వాసాల పంచాయితీ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై కొంతమంది చైర్మన్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికలకు ముందు అవిశ్వాస గొడవను ఆపాలన్న ఉద్దేశంతో మున్సిపల్ చట్టానికి సవరణ బిల్లును తీసుకువచ్చేందుకు యత్నించింది. ఈ బిల్లును గవర్నర్ తమిళిసై ఆమోదించలేదు. చైర్మన్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ లొల్లి ఎందుకని అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవిశ్వాస ఫిర్యాదులకు సహకరించకపోవడంతో అక్కడితో బ్రేక్ పడింది. ఎన్నికలు ముగియడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ అవిశ్వాసాల రగడ ప్రారంభమైంది. మరో ఏడాది మాత్రమే పాలక మండలికి గడువున్నప్పటికీ ఆయా పదవులపై ఆశలు పెట్టుకున్న వారు, చైర్మన్లపై అసంతృప్తితో ఉన్న కౌన్సిలర్లు ఏకమై పావులు కదపడం ప్రారంభించారు.

ఆదిబట్లలో కలిసికట్టుగా కౌన్సిలర్ల నోటీసులు

తాజాగా శుక్రవారం ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని 15 మంది కౌన్సిలర్లలో 12 మంది చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక, వైస్ చైర్‌పర్సన్ కోరె కళమ్మపై అవిశ్వాసం పెట్టాలని కలెక్టర్ కార్యాలయంలో స్థానిక సంస్థల అధికారికి నోటీసులు అందించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లు ఈ నోటీసులు అందించిన వారిలో ఉండటం గమనార్హం. కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలిచిన కొత్త ఆర్తిక బీఆర్‌ఎస్‌లో చేరి అప్పట్లో చైర్ పర్సన్ పదవిని దక్కించుకున్న సంగతి తెలిసిందే. అప్పటి స్థానిక, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఆమెకు పొసగక తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్‌కు చెందిన కోరె కళమ్మ వైస్ చైర్మన్‌గా ఉన్నారు. వీరిద్దరిపై అవిశ్వాసం పెట్టాలని పార్టీలకు అతీతంగా కలిసికట్టుగా కౌన్సిలర్లు నోటీసులు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఇదిలావుంటే ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట చైర్మన్లపై గతేడాదే అవిశ్వాసానికి ఫిర్యాదులు అందజేశారు. మళ్లీ ఆ ఫిర్యాదులను కదలించేందుకు కౌన్సిలర్లు యత్నిస్తున్నారు. అందుకు వ్యూహరచనలు చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా రాజకీయాలు వేడెక్కాయి. కౌన్సిలర్లను క్యాంపులకు తరలించేందుకు చైర్మన్ పదవులను ఆశిస్తున్న వారు ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా చోట్ల సొంత పార్టీ సభ్యులే తిరుగుబాటు చేస్తుండటం విశేషం.

హోర్డింగ్‌లను వదిలేశారు!

- తొలగింపునకు ముందుకు రాని ఏజెన్సీలు
- కాగితాలకే పరిమితమైన కార్యాచరణ
- కాలయాపనతో పెరిగిపోతున్న వీటి సంఖ్య
- మళ్లీ టెండర్లను పిలిచిన జీహెచ్‌ఎంసీ



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో అక్రమ హోర్డింగులు, యూనిపోల్స్ తదితర వ్యాపార ప్రకటనలకు సంబంధించిన బోర్డుల తొలగింపు కాగితాల్లో తప్ప కార్యాచరణకు నోచుకోవడం లేదు. గ్రేటర్‌లో రెండువేలకు పైగా ఉన్న ఇలాంటి వాటిని తొలగిస్తామని జీహెచ్‌ఎంసీ ప్రకటించి నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. వీటిని తొలగించేందుకు గతంలో సైతం రెండు మూడు పర్యాయాలు టెండర్లు ఆహ్వానించినప్పటికీ కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో పనులు జరగలేదు. భవనాల రూఫ్‌టాప్‌లు తదితర ప్రాంతాల్లో ఉన్న హోర్డింగులను యజమానులే తొలగించాల్సిందిగా ఆదేశించింది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. ఎలాంటి చర్యలు తీసుకోలేక, ఇక తామే తొలగించేందుకు యంత్రాంగం సిద్ధమై టెండర్లు పిలిచినా ఏజెన్సీలు ముందుకు రాలేదు. టెండరు నిబంధనల మేరకు హోర్డింగులతో పాటు యూనిపోల్స్, బస్‌షెల్టర్స్, గ్లో సైన్ బోర్డులు, ఇతరత్రా వ్యాపార ప్రకటనలన్నీ తొలగించే బాధ్యత ఏజెన్సీలదే. ఇందుకోసం ఏజెన్సీలకు జీహెచ్‌ఎంసీ చెల్లించేదేమీ లేదు. జీహెచ్‌ఎంసీకే అవి చెల్లించాలి. అందుకే ఏజెన్సీలు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

ఇదంతా నిబంధనాలతోనే..

- హోర్డింగులను తొలగించడంతో వెలువడే ఐరన్, స్క్రాప్ ఏజెన్సీ తీసుకోవాలి. ఇందుకోసం టన్నుకు ఇంత అనే రేటు వంతున జీహెచ్‌ఎంసీకి చెల్లించాలి. అలా జీహెచ్‌ఎంసీకి ఎక్కువ రేట్ (హెచ్1) ఇచ్చేందుకు ముందుకొచ్చే ఏజెన్సీలకు హోర్డింగులను తొలగించే టెండరు ఖరారు చేస్తుంది. అంతేకాదు.. క్షేత్రస్థాయిలో ఎన్ని హోర్డింగులున్నాయో, వాటిని తొలగించడం ద్వారా రాగల ఆదాయమెంతో తదితరాలను ఏజెన్సీలే అంచనా వేసుకొని టెండరులో పాల్గొనాలి. తొలగించేందుకు అనువైన పరిస్థితులున్నదీ, లేనిదీ చూసుకోవాలి. అవన్నీ చూసుకొని తొలగించే బాధ్యత ఏజెన్సీలదే.
- తొలగింపు సందర్భంగా ఎదురయ్యే సమస్యలు సైతం ఏజెన్సీలే పరిష్కరించుకోవాలి. జీహెచ్‌ఎంసీ సహకరించదు. ఇలాంటి నిబంధనలుండటం వల్లే ఏజెన్సీలు ముందుకు రావడం లేదని పలువురు భావిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ కాగితాల్లో చూపేందుకు మాత్రమే టెండర్లు ఆహ్వానిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హోర్డింగుల తొలగింపు పనులను ఏజెన్సీలకు కాంట్రాక్టుకిచ్చే బదులు జీహెచ్‌ఎంసీ స్వయంగా చేపడితే పనులు జరగొచ్చనే అభిప్రాయాలున్నాయి. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఆ పని చేయాలని, నిబంధనలు మార్చకుండా కేవలం టెండర్లు ఆహ్వానించినంత మాత్రాన ప్రయోజనం ఉండదని పలువురు భావిస్తున్నారు.

ఓర్వలేకే తప్పుడు ప్రచారం



ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో బస్సులోని మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న సునీతరావు

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు

ఇబ్రహీంపట్నం: అధికారం కోల్పోయిన అక్కసుతో టీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ పథకల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై శుక్రవారం ఇబ్రహీంపట్నం బస్టాండ్‌లో మహిళలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ పథకాన్ని చాలామంది మహిళాలు వినియోగించుకుంటున్నారని, దీంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుండటంతో ప్రతిపక్షాలకు అక్కసు పుట్టిందన్నారు. ఈ పథకంపై కావాలని బీఆర్‌ఎస్ కుట్రపూరితంగా వ్యవహరిస్తూ.. ఆటో డ్రైవర్లను ఉసిగొల్పి రాజకీయాలు చేయడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ.12 వేల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేరువ అవుతుండటంతో ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. ఉచిత ప్రయాణంపై మహిళలు బస్సుల్లో కొట్టుకుంటున్నట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. మహిళలకు నెలకు రూ.2,500 త్వరలో అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సదాలక్ష్మి, కవిత, ఉషశ్రీ, మాధవి, వెంకటమ్మ, మంజుల, అమృత, రత్నకుమారి, లావణ్య పాల్గొన్నారు.

వన భోజనాలతో కార్మికుల్లో ఐక్యత

ఆర్టీసీ ఎండీ సజ్జనార్

రాజేంద్రనగర్: కార్మికుల్లో ఐక్యత, స్నేహభావం పెంపొందించేందుకు వన భోజనాలు ఎంతగానో దోహదపడతాయని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో ఆవరణలో నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం డిపో ఆవరణలో మొక్కలు నాటారు. కార్మికులకు భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. సిబ్బందితో మమేకం కావడం కోసం వన భోజన కార్యక్రమాలను డిపో ఆవరణలో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతిరోజు విధి నిర్వాహణలో బిజీగా ఉండే ఉద్యోగుల్లో ఉల్లాసాన్ని నింపేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మిన్) కృష్ణకాంత్, హైదరాబాద్ ఆర్‌ఎం వరప్రసాద్, డిప్యూటీ ఆర్‌ఎం విజయ భాను, జగన్, రాజేంద్రనగర్ డిపో మేనేజర్ శ్రీనాథ్‌తో పాటు కార్మికులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

- షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్
- ఏడాదికి రూ.5లక్షల చొప్పున కేంద్రం నుంచి పారితోషికం

షాద్‌నగర్: ఉత్తమ సేవలు అందిస్తున్న గాను షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర ప్రభుత్వం ఎన్‌క్యూఏఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల) ధ్రువపత్రం దక్కింది. పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని గత సెప్టెంబర్ 29, 30 తేదీల్లో జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల బృందం సభ్యులు పాటిల్, ఆయుష్ మహ్మద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి సేవలు అందజేస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వివిధ విభాగాలను తనిఖీ చేశారు. రోగులకు అందించే ఆరోగ్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు.

79.1 శాతం మార్కులు

ఆస్పత్రిలో ప్రభుత్వం నిర్దేశించిన అన్ని ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అన్న విషయాలను కేంద్ర బృందం సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలోని లేబర్‌రూం, ఓపీ, ఐపీ, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, రేడియాలజీ, సాధారణ పరిపాలన వంటి విభాగాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో కల్పిస్తున్న సదుపాయాలు, వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అన్ని విభాగాల్లో కలిపి 79.1 శాతం మార్కులు వచ్చాయి.

మూడేళ్ల పాటు పారితోషికం

ఉత్తమ సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం షాద్‌నగర్ ఆస్పత్రికి మూడేళ్లు చెల్లుబాటయ్యే ఎన్‌క్యూఏఎస్ ధ్రువపత్రం అందజేసింది. ప్రతి సంవత్సరం రూ.5 లక్షల చొప్పున మూడేళ్ల పాటు ఆస్పత్రి అభివృద్ధికి పారితోషికం అందజేయనుంది.



షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి

మరింత బాధ్యత పెరిగింది



ఆస్పత్రిలో ఉత్తమ సేవలకు గాను ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్ అందజేయడం చాలా ఆనందంగా ఉంది. దీంతో మాపై మరింత బాధ్యత పెరిగింది. కేంద్ర ప్రభుత్వం అందజేసే నిధులను ఆస్పత్రి అభివృద్ధికి ఖర్చు చేస్తాం.

– డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్

పదేళ్లలో ఏం చేశారు?

- బీఆర్‌ఎస్‌ను జనం నమ్మే పరిస్థితి లేదు
- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సాక్షి, రంగారెడ్డిజిల్లా : ప్రశ్నపత్రాల లీకులు, ప్రభుత్వ పాఠశాల మూసివేతలతో అస్తవ్యస్తంగా పాలన అందించిన బీఆర్‌ఎస్ పార్టీ, మాజీ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ఎప్పుడిస్తారని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించడంపై డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు రెండుసార్లు మంత్రిగా పనిచేసి, ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి గెలిచి, పార్టీకి వెన్నుపోటు పొడిచి బీఆర్‌ఎస్ పార్టీలో చేరి తిరిగి మంత్రి పదవి సంపాదించుకున్న సబితారెడ్డి ప్రజలకు ఏం చేశారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య, దళితులకు రూ.10 లక్షల దళిత బంధు, మూడెకరాల భూ హామీలను ఎందుకు అమలు చేయించలేకపోయారని నిలదీశారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను ప్రజలు విశ్వసించే పరిస్థితిలో లేరన్నారు. ఆ నాయకులు ఇప్పటికైనా ఈవిషయాన్ని గుర్తు పెట్టుకుని ప్రతిపక్ష పాత్ర సక్రమంగా నిర్వర్తించాలని, లేదంటే త్వరలోనే ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయమన్నారు.

కాన్హాలో కోవిడ్ కలకలం

- ఏడుగురు విదేశీయులకు పాజిటివ్
- ఆశ్రమంలోనే ఐసోలేషన్‌లో బాధితులు
- భయందోళనలో స్థానికులు

నందిగామ: మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో ఏడుగురు విదేశీయులకు కారోనా పాజిటివ్ నిర్ధారణ కావడం కలకలం రేపింది. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి కథనం ప్రకారం.. కాన్హా శాంతి వనంలో గత నెల 29 నుంచి ఓ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సుకు దేశ విదేశాలకు చెందిన వేలాది మంది రాకపోకలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కరోనా టెస్టులు నిర్వహిస్తూ వచ్చారు. 66 మందికి లక్షణాలు కనిపించడంతో టెస్ట్ చేయగా ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. పాజిటివ్ వచ్చిన వారిని ఆశ్రమంలోనే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఐసోలేషన్ కేంద్రంలో ఉంచి చికిత్స కొనసాగిస్తున్నారు.

భయంభయంగా..

కాన్హా శాంతి వనంలో కరోనా కేసులు నమోదవుతున్నట్లు తెలియడంతో స్థానికులు భయందోళనలకు గురవుతున్నారు. వేలాది మంది విదేశీయులు రాకపోకలు కొనసాగించే ఈ ఆశ్రమంలో ఇంకా ఎంత మందికి వచ్చిందోనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

నిర్వాహకుల గోప్యత..

కాగా, కాన్హాలో కరోనా కేసుల నమోదు గురించి నిర్వాహకులను సంప్రదించగా అలాంటిదేమీ లేదని చెప్పారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ను సంప్రదించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. గత నెల 29 నుంచి ప్రారంభమైన ఈ సదస్సు ఈ నెల 13 వరకు కొనసాగనుందని సమాచారం. చాలా మంది ప్రముఖులు హాజరుకానున్నారని తెలిసింది.

బడి బస్సులే యమపాశాలై!

స్కూల్ బస్సు చక్రాల కింద నలిగిపోతున్న చిన్నారులు

- అనుభవం, నైపుణ్యం, నియంత్రణ లేమితో ప్రమాదాలు
- ర్యాష్ డ్రైవింగ్, ఇరుకు రహదారులపై ఓవర్ స్పీడ్
- మొక్కుబడి తనిఖీలకే పరిమితమైన రవాణా శాఖ
- గ్రేటర్ పరిధిలో తరచూ జరుగుతున్న దుర్ఘటనలు
- రెండ్రోజుల క్రితం హబ్సిగూడలో అసువులు బాసిన చిన్నారి



సాక్షి, సిటీబ్యూరో: చిన్నారుల పాలిట స్కూల్ బస్సులు యమదూతల్లా మారాయి. అభం శుభం తెలియని బాలలను బలిగొంటున్నాయి. డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా పిల్లలు మృత్యువాతపడుతున్నారు. డ్రైవింగ్‌లో అనుభవం, నైపుణ్యం లేకుండానే స్కూల్ బస్సులను నడపడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రోడ్డుపై పాదచారులను, చిన్నారులను గమనించకుండానే వాహనాలను నడపడంతో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. హబ్సిగూడలో గురువారం నాటి ఘటనే ఇందుకు ఉదాహరణ. బస్సు ఆగినప్పుడు, తిరిగి బయలుదేరే సమయంలో విధిగా ముందూ వెనకా గమనించాలి. బస్సులో ఉండే సహాయకులు కిందకు దిగి అన్నివైపులా చూసి డ్రైవర్‌కు సంకేతం ఇవ్వాలి. కానీ.. ఇలాంటి కొద్దిపాటి జాగ్రత్తలను కూడా పాటించకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయి. మరోవైపు పిల్లలను బస్సెక్కించేటప్పుడు, దిగిన తర్వాత తిరిగి ఇళ్లకు తీసుకెళ్లే సమయంలో తమ వెంట ఉండే చిన్నారులను గమనించకపోవడంతోనూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

తనిఖీలు నామమాత్రం

రహదారి భద్రతలో భాగంగా బడి బస్సుల నిర్వహణపై రవాణాశాఖ ప్రత్యేక శ్రద్ధ వహించడంలేదు. కొంతకాలంగా అధికారుల ఉదాసీనత, డ్రైవర్లపై కొరవడిన నియంత్రణ ప్రమాదాలకు దారితీస్తోంది. ఏటా స్కూళ్లు, కాలేజీలు తెరుచుకొనే సమయానికి అన్ని ప్రాంతీయ రవాణా కేంద్రాలకు చెందిన తనిఖీ అధికారులు విధిగా బస్సులను తనిఖీలు చేసి వాటి సామర్థ్యాన్ని నిర్ధారించాలి. డ్రైవర్ల అనుభవంపైనా అధికారులకు కచ్చితమైన అవగాహన ఉండాలి. విద్యాసంస్థల యజమానులు డ్రైవర్లను నియమించుకొనే సమయంలో తప్పనిసరిగా నిబంధనలు పాటించేలా పర్యవేక్షించాలి. కానీ.. రవాణా అధికారులు ఏడాదికి ఒకసారి మొక్కుబడి తనిఖీలకు మాత్రమే పరిమితమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు స్కూల్ బస్సుల నిర్వహణలో విద్యాసంస్థల వైఫల్యం కూడా ఉంది. రూ.లక్షల్లో ఫీజులు తీసుకొనే కార్పొరేట్ స్కూళ్లు బస్సుల నిర్వహణలో దారుణంగా వ్యవహరిస్తున్నాయి. డ్రైవర్ల నియామకం, సహాయకుల ఏర్పాటుపై అశ్రద్ధ చూపుతున్నాయి. లారీలు, గూడ్స్ వాహనాలను నడిపేవారికి పిల్లల బస్సులను అప్పగించడంతో ర్యాష్ డ్రైవింగ్, ఓవర్‌స్పీడ్‌కు పాల్పడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తల్లిదండ్రులు సైతం బాధ్యులే..

పెద్ద పిల్లలను స్కూల్ బస్సెక్కించే సమయంలో వారితో పాటు చిన్నారులను బయటకు తీసుకురావడం ఒక నిర్లక్ష్యపు అలవాటుగా మారింది. బయటకు వచ్చిన తర్వాత తమ వెంట మరో పాప, లేదా బాబు ఉన్నారనే విషయాన్ని మరిచి.. పెద్ద పిల్లలను బస్సెక్కించడంలోనే నిమగ్నమవుతున్నారు. చాలా సార్లు ఇలాంటి నిర్లక్ష్యం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని రవాణా అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటిసమయాల్లో చిన్నవారిని ఇంటి నుంచి బయటకు రానివ్వకపోవడమే మంచిది. ఒకవేళ బయటకు తీసుకొచ్చినా ఒక చేత్తో పట్టుకొని ఉండడం మరిచిపోవద్దు. మరోవైపు స్కూల్ బస్సు నడిపే డ్రైవర్‌కు రవాణా అధికారులు ఆమోదించిన లైసెన్స్, అనుభవం వంటి అంశాలను కూడా పరిశీలించాలి. పేరెంట్స్ కమిటీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

డ్రైవర్లకు రిఫ్రెషర్ శిక్షణ అవసరం..

- బస్సులను నడిపే సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై పాఠశాల యాజమాన్యం డ్రైవర్లు, అటెండర్లను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలి.
- రవాణా అధికారుల పర్యవేక్షణలో డ్రైవర్లకు తప్పనిసరిగా రిఫ్రెషర్ శిక్షణ కోర్సులను నిర్వహించాలి.
- సాధారణంగా రోజూ నడిపే డ్రైవర్ లేని సమయంలో కొత్త వారికి బస్సులను అప్పగిస్తారు. ఇలా ప్రత్యామ్నాయ డ్రైవర్‌ను ఎంపిక చేసేటప్పుడు ఎంతో జాగ్రత్త అవసరం.
- నిలిపి ఉంచిన స్కూల్ బస్సుల వద్దకు పిల్లలు వెళ్లకుండా జాగత్తలు పాటించాలి.

గత ఏడాది నుంచి ఇప్పటి వరకు ప్రమాదాలిలా..

- గత జూలైలో ఆదిభట్లలో ఇంటిముందు ఆడుకుంటున్న ఆరేళ్ల చిన్నారిని ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది.
- ఆగస్టులో బాచుపల్లిలో ఓ స్కూల్ బస్సు బైక్‌ను ఢీకొన్న ఘటనలో రెండో తరగతి చిన్నారి అక్కడికక్కడే కన్నుమూసింది. ఇదే నెల 28న సునీత అనే పారిశుద్ధ్య కార్మికురాలిని ఒక మెడికల్ కాలేజీ బస్సు ఢీకొట్టడంతో ఆమె కన్నుమూశారు.
- సెప్టెంబర్‌లో ఇబ్రహీంపట్నం వద్ద ఓ స్కూల్ బస్సు ఇద్దరు చిన్నారులను ఢీకొంది.
- నవంబర్ 2న సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న స్కూల్ బస్సు డ్రైవర్ తండ్రితో కలిసి రోడ్డు దాటుతున్న మూడేళ్ల చిన్నారిని ఢీకొట్టాడు.
- నవంబర్ 19న ఆనంద్‌నగర్‌లో రెండున్నరేళ్ల చిన్నారి స్కూల్ బస్సు.. ముందు చక్రాల కింద నలిగిపోయింది.
- డిసెంబర్ 15న బీఎన్‌రెడ్డినగర్‌లో నాలుగేళ్ల చిన్నారిని స్కూల్ బస్సు ఢీకొట్టింది.
- జనవరి 4వ తేదీన హబ్సిగూడలో ఏడాదిన్నర చిన్నారి స్కూల్ బస్సు చక్రాల కింద పడి అసువులు బాసింది.

రాజేంద్రనగర్ డీసీపీగా 'చింతమనేని'

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డీసీపీగా చింతమనేని శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహేశ్వరం జోన్ డీసీపీగా ఉన్న ఆయన రాజేంద్రనగర్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. డీసీపీ శ్రీనివాస్ గతంలో రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ గా, శంషాబాద్ ఏసీపీగా పనిచేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, స్థానికులు డీసీపీని సన్మానించారు.

విద్యార్థులకు సృజనాత్మకత ముఖ్యం

- గురుకులాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయాధికారి డాక్టర్ శారద
- పాఠశాలలో ఘనంగా సైన్స్ ఫెయిర్

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు నాణ్యమైన విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలంగాణ రాష్ట్ర గురుకులాల పశ్చిమ ప్రాంతీయ సమన్వయ అధికారి డాక్టర్ శారదావెంకటేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలో గల చేవెళ్ల గురుకుల పాఠశాలలో జెన్య ఈవెంట్స్ 2023–24, జెన్య ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్, రంగోళి కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. విద్యార్థులు బోధన, అభ్యాసన పరికరాల ద్వారా తరగతి గదుల్లో చేసిన కృత్యాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ శారదావెంకటేష్ మాట్లాడుతూ.. విద్యార్థులు చేసిన సైన్స్ నమునాలు, రంగోళి ఎంతో చక్కగా ఉన్నాయన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని ఆలోచనలతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందన్నారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అక్బర్, పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి, ప్రధానోపాధ్యాయుడు నర్సింహ, ఉపాధ్యాయుడు దర్శన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల ఎగ్జిబిట్స్‌ను తిలకిస్తున్న శారద

కోర్టు భవన నిర్మాణానికి కృషి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు భవన సముదాయ నిర్మాణానికి అనువైన స్థలాన్ని గుర్తించి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు. పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అనంతరం కోర్టు భవన నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించి నిర్మించాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కోర్టు భవన నిర్మాణానికి అవసరమైన స్థలం గుర్తిస్తామన్నారు. తహసీల్దార్‌తో మాట్లాడి అనువైన స్థలం ఎంపిక చేస్తామన్నారు. దానికి అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. కోర్టుకు వచ్చే కక్షిదారులు, న్యాయవాదులకు ఇబ్బందులు లేకుండా కోర్టు భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూలు జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణశర్మ, ఉపాధ్యక్షులు యాదీలాల్, జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, సభ్యులు వెంకట్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, జమీల్ అహ్మద్, రామకృష్ణ, శేఖర్, మధు, మల్లేశ్, సంతోష్, గణేశ్, దేవేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బార్ అసోసియేషన్ సత్కార సభలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఎక్సైజ్ స్టేషన్ సందర్శన

ఆమనగల్లు పట్టణంలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌ను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేని సీఐ బద్యానాద్ చౌహాన్ ఆధ్వర్యంలో సిబ్బంది సత్కరించారు. ఎక్సైజ్ పోలీసు స్టేషన్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను ఎక్సైజ్ సీఐ కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, నాయకులు పాల్గొన్నారు.

మహిళ మృతిపై కేసు నమోదు

తలకొండపల్లి: అనారోగ్యంతో బాధపడుతూ ఓ మహిళ ఆకస్మికంగా మృతి చెందిందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీను ప్రకారం.. మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామానికి ఇటీవల భీంబాయి, విఠల్‌రావు దంపతులు వలస వచ్చి కత్తులు, గొడ్డళ్లు తయారు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. భీంబాయి జ్వరం, దగ్గు, జలుబుతో కొన్ని రోజుల నుంచి బాధ పడుతున్నారు. దీంతో శుక్రవారం ఉదయం తెల్లవారుజామున భీంబాయి(55) మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

టైర్లలో దాచి ఉంచిన గంజాయి స్వాధీనం

జీడిమెట్ల: ఓ ఇంట్లో టైర్లలో దాచి ఉంచిన 86 కిలోల గంజాయితో పాటు గంజాయి స్మగ్లింగ్ చేసే వ్యక్తిని బాలానగర్ ఎస్‌వోటీ, జీడిమెట్ల పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. శుక్రవారం జీడిమెట్ల పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడి యా సమావేశంలో సీఐ శ్రీనివాసరావు ఎస్‌వోటీ పోలీసులతో కలిసి వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లాకు చెందిన వెంకటకృష్ణకాంత్ చిన్న చిన్న వ్యాపారాలు చేసేవాడు. వ్యాపారాల్లో డబ్బు సరిగా రావడం లేదని నగరానికి వలసవచ్చి చింతల్ వెంకటేశ్వరనగర్‌లోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి స్మగ్లింగ్ వ్యాపారాన్ని ఎంచుకున్నాడు. వెంకటకృష్ణ నాలుగురోజుల క్రితం సీలేరు నుంచి రాజస్థాన్ రాష్ట్రానికి గంజాయిని తరలించేందుకు గణేష్ అనే వ్యక్తితో బేరం కుదుర్చుకున్నాడు.

జేసీబీ టైర్లలో ఉంచి..

ఎవరికీ అనుమానం రాకుండా గంజాయిని జేసీబీ టైర్లలో ఉంచి బొలేరో వాహనంలో తీసుకువచ్చి తాను ఉంటున్న అద్దె ఇంట్లో దాచాడు. వెంకటకృష్ణ గంజాయిని తీసుకువచ్చినట్లు బాలానగర్ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే ఎస్‌వోటీ పోలీసులు జీడిమెట్ల పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి నిర్వహించి జేసీబీ టైర్లలో ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకుని వెంకటకృష్ణను ఠాణాకు తరలించారు. కేసు నమోదు చేసుకుని శుక్రవారం రిమాండుకు తరలించారు.

ప్రైవేట్ ఉద్యోగి కిడ్నాప్

గాలింపు చేపట్టిన ప్రత్యేక బృందాలు

గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్‌కు కూతవేటు దూరంలో ఓ ప్రైవేట్ ఉద్యోగి కిడ్నాప్‌కు గురయ్యాడు. కిడ్నాప్‌ను ఛేదించేందుకు సైబరాబాద్ ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. పోలీసులు తెలిపిన మేరకు.. గోకుల్ ప్లాట్స్‌లో నివాసం ఉండె గుగ్గ్రం సురేందర్(35) ఓ ప్రైవేట్ టెలీకాం కంపెనీలో టెక్నికల్ సపోర్టర్‌గా పని చేస్తున్నారు. గురువారం సాయంత్రం 7 గంటల సమయంలో ఖాజాగూడ పెద్ద చెరువు లింక్ రోడ్డులో సోదరి నిఖితతో మాట్లాడుతుండగా స్విఫ్ట్ కారులో వచ్చిన నలుగురు తన సోదరుడు సురేందర్‌ను కిడ్నాప్ చేశారని నిఖిత రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్‌కు కారణమని తెలుస్తోంది. డబ్బు విషయంలో తీసుకెళ్లారని, పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని వాట్సాప్ కాల్ చేసి కుటుంబ సభ్యులతో మాట్లాడినట్లు పోలీసులు చెబుతున్నారు. ఆరు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయని, బాధితుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నామని మాదాపూర్ అడిషనల్ డీసీపీ నర్సింహ్మ రెడ్డి పేర్కొన్నారు. కొంత మంది కిడ్నాపర్లను పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలపై కన్నెర్ర


పహాడీషరీఫ్: శిఖం భూమిలోని నిర్మాణాల కూల్చివేతలు


అబ్దుల్లాపూర్‌మెట్: అక్రమ నిర్మాణాలను కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది

- కూల్చివేతలు చేపట్టిన అధికారులు
- పహాడీషరీఫ్ ఎఫ్‌టీఎల్ పరిధిలో, తట్టి అన్నారం ప్రభుత్వ భూమిలో నిర్మాణాల ధ్వంసం

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని తాళ్లకుంట శిఖం భూమిలో వెలిసిన నిర్మాణాలను మున్సిపాలిటీ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను గుర్తించిన గ్రామస్తులు మున్సిపాలిటీ, నీటి పారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ శాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్, జల్‌పల్లి టీపీవో హబీబున్నీసాలు తమ సిబ్బందితో కలిసి కుంటకు చేరుకొని అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం జేసీబీతో ప్రహరీతో పాటు ఒక బేస్‌మెంట్‌ను కూల్చివేశారు. కుంటలోకి నీరు పోకుండా మట్టితో నింపి వేసిన రోడ్లను కూడా తవ్వి నీరు వెళ్లే మార్గం చేశారు. కాగా 6.20 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ కుంట పరిధిలో 169 సర్వే నంబర్‌లో శిఖం భూమి ఉందన్నారు. 208–పార్ట్, 211–పార్ట్, 212–పార్ట్, 213–పార్ట్ సర్వే నంబర్లలో నీరు నిల్వ ఉండే ప్రాంతమని ఇందులో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వరాదని మున్సిపాలిటీ అధికారులకు లేఖ రాశామని ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడితే చూస్తూ ఊరుకోమని.. ఆక్రమణలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిజాముద్దీన్ హెచ్చరించారు. పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని తట్టిఅన్నారం సర్వే నంబర్ 106తో పాటు తట్టిఖానా సర్వే నంబర్ 26లోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని చేపట్టిన అక్రమ నిర్మాణాలను మండల తహసీల్దార్ రవీందర్ దత్ ఆదేశాల మేరకు శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీబీల సహాయంతో ఆర్‌ఐ కూల్చివేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు నెలలుగా ఎన్నికల విధుల్లో రెవెన్యూ అధికారులు నిమగ్నమవ్వడంతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని కొందరు అక్రమ నిర్మాణాలను చేపట్టారన్నారు. నిరుపేదలను, అమాయకులను ఆసరాగా చేసుకుని కబ్జాదారులు పభుత్వ స్థలాలను విక్రయిస్తుంటే కొనుక్కొని మోసపోకూడదని సూచించారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

యాచారం: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ కేంద్రంలో చోటుచేసుకుంది. యాచారం సీఐ సైదయ్య ప్రకారం.. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి చెందిన నాగలపల్లి రాంరెడ్డి (65) శుక్రవారం తన స్కూటీపై మాల్ మార్కెట్‌కు వెళ్లాడు. మార్గ మధ్యలో మాల్ మార్కెట్ సమీపంలోని మైసమ్మ దేవాలయ దగ్గర నల్గొండ జిల్లా దేవరకొండ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు రాంరెడ్డి స్కూటీని ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..


రాఘవేందర్‌గౌడ్ (ఫైల్)

షాబాద్: బైక్ అదుపుతప్పి పడిపోయిన ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని సంకెపల్లిగూడ గ్రామంలో గురువారం రాత్రి 11గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి ప్రకారం.. గ్రామానికి చెందిన ఎం.రాఘవేందర్‌గౌడ్(21) నాగర్‌గూడ నుంచి ఇంటికి తిరుగుప్రయాణం అయ్యాడు. ఈ క్రమంలో భారత్ గ్యాస్ గోదాం వద్దరకు రాగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఛాతిలో బలమైన గాయమవ్వడంతో చికిత్స నిమిత్తం షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కుస్తీ పోటీలు ప్రారంభం

పాల్గొన్న 300 మంది రెజ్లర్లు

అత్తాపూర్: ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తిగా ఐదేళ్లుగా కొనసాగిస్తున్న రెజ్లింగ్ పోటీలు అత్తాపూర్ రాంబాగ్ గ్రౌండ్‌లో శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఈ కుస్తీ పోటీల్లో 300 మంది రెజ్లర్లు పాల్గొన్నారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా రాజేంద్రనగర్ ఏసీపీ గంగాధర్, రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు నరసింహా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా కుస్తీ పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన పహిల్వాన్లను అభినందించారు. యువకులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇప్పుడిప్పుడే తెలంగాణ రాష్ట్రంలో కుస్తీ పోటీల్లో మహిళలు రాణిస్తున్నారని చెబుతూ కరీంనగర్ జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ బంగారు పథకాన్ని సాధించిన విషయం గుర్తుచేశారు. అంతకిభావం, ధృఢ విశ్వాసంతో కలిగిన క్రీడాకారులు విజయాలు సాధిస్తారని తెలిపారు. 150 మంది రెజ్లర్లు శుక్రవారం జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పెండెం మధు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై లింగం, బీజేపీ నాయకులు వై.శ్రీధర్, కొమరయ్య, మల్లారెడ్డి, ఎన్.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం



పహాడీషరీఫ్: ఇద్దరు బాలికలు అదృశ్యమైన ఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మరియం నగర్ కాలనీకి చెందిన అస్మాబేగం ఈ నెల 4న సాయంత్రం స్థానికంగా తాను పనిచేసే రుఖియా బేగం వద్ద జీతం డబ్బులు తీసుకురమ్మని తన కుమార్తె రజియా బేగం(16), అక్క ఆబేదా కుమార్తె సుమయా బేగం(13)లను పంపించింది. వారు ఎంతకూ ఇంటికి రాకపోవడంతో అస్మా బేగం వెంటనే రుఖియా బేగానికి ఫోన్ చేయగా, అప్పటికే డబ్బులు తీసుకొని వెళ్లారని చెప్పింది. దీంతో ఆందోళనకు గురైన ఆమె బాలికల కోసం వెతికినా ఆచూకీ లభ్యమవ్వలేదు. తన వస్త్రాలతో కూడిన బ్యాగ్‌ను సుమయా తీసుకెళ్లినట్లు తెలిసింది. గతంలో కూడా సుమయా ఇలాగే వెళ్లి నాలుగు రోజుల అనంతరం తిరిగి వచ్చింది. శుక్రవారం అస్మాబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఉద్యమకారులను ఆదరించండి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ కోసం పోరాడిన విద్యార్థి ఉద్యమకారులను ఆదరించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కోరినట్లు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఓయూ జేఏసీ, టీఎస్ జాక్ చైర్మన్ దుర్గం భాస్కర్ తెలిపారు. శుక్రవారం జ్యోతిరావ్‌పూలే ప్రజా భవన్‌లో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛాన్ని అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలలో ఉద్యమకారులకు ప్రకటించిన పథకాలను అమలు చేయాలని కోరినట్లు చెప్పారు.


డిప్యూటీ సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దుర్గం భాస్కర్

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమల నిర్వాహకులు తమవంతు సహకారం అందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఇందులో భాగంగా శుక్రవారం కొత్తూరు మున్సిపాలిటీలో రౌండ్‌టేబుల్, లేడీస్ సర్కిల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన అదనపు పాఠశాల గదులను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ చదువుల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. ప్రతి విద్యార్థి ప్రాథమిక దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, వైస్‌చైర్మన్ రవీందర్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, సురేందర్, శివశంకర్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, ఎంఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి

దాతల సహకారం మరువలేనిది

కేశంపేట: గ్రామాలను అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో తుక్కుగూడ నారాయణరెడ్డి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వేణుగోపాలస్వామి దేవాలయ ముఖద్వారాన్ని నిర్మించారు. శుక్రవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిలు పాల్గొని ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.51 లక్షలతో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు మంజుల మల్లేశ్, వెంకట్‌రెడ్డి, స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యాం సుందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్, యాదయ్యయాదవ్, శ్రీధర్‌రెడ్డి, రూప్లానాయక్, భాస్కర్‌గౌడ్, దశరథ, తహసీల్దార్ అజీంఅలీ, ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంఈఓ మనోహర్, ప్రధానోపాధ్యాయుడు రసూల్ పాల్గొన్నారు.